క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు


ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

పెంచికల్‌పేట్: పీహెచ్‌సీలో అక్రమ నిర్మాణాలపై సాక్షిలో ఆదివారం పీహెచ్‌సీలో అక్రమ కట్టడాలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం పీహెచ్‌సీలోని అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి పీహెచ్‌సీని సందర్శించారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని సదరు వ్యక్తులను ఆదేశించారు. లేని పక్షంలో చట్ట ప్రకారం ఆక్రమణలు తొలగించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా, ఆస్తులను ధ్వంసం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ గోపాల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ


గొడుగులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం ఆధ్వర్యంలో ఉచితంగా గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు, ఎస్పీఎం ప్రతినిధులు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో చిరు వ్యాపారస్తులు ఎండతో ఇబ్బందులు పడకుండా గొడుగులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎం ప్రతినిధి తుమ్మ రమేశ్, స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీణా బివాల్, సభ్యులు అశోక్, సుందరం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

కాగజ్‌నగర్‌రూరల్/ చింతలమానెపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలను డీలర్లు అందుబాటులో ఉంచాలని ఏవో రామకృష్ణ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాలలో రికార్డులు పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన దిగుబడి ఇచ్చే విత్తనాలను విక్రయించాలని సూచించారు. డీలర్లు నిషేధిత విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ సంబంధిత సమస్యలు ఉంటే వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'అనుకూలంగా లేని పనివేళలతో ఆందోళన'

రెబ్బెన: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం ప్రకటించిన పనివేళలు కార్మికులకు అనుకూలంగా లేకపోవటంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోలేటిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓసీపీలు, సీహెచ్‌పీల్లో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పనివేళలు మార్చాలని కార్మిక సంఘాల డిమాండ్ మేరకు యాజమాన్యం ప్రకటించిన పనివేళలు కార్మికులకు ఏమాత్రం అనుకూలంగా లేవన్నారు. మొదటి షిఫ్టు మధ్యాహ్నం 2గంటల వరకు నిర్ణయించటంతో ఇంటికి వెళ్లే కార్మికులు మండుటెండల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని త ద్వారా కార్మికులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. యాజమాన్యం పనివేళల మార్పుపై పునరాలోచించి గతంలో మాదిరి కొనసాగించాలన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవారం నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ పరీక్షకు 97 మంది విద్యార్థులకు 94 మంది హాజరు కాగా.. 11 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ తృతీయ సంవత్సరం ఆరో సెమిస్టర్ పరీక్షకు 175 మందికి 164 మందికి హాజరు కాగా.. 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సోమవారం జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం హరితహారం నర్సరీని పరిశీలించారు. ఎండ వేడికి మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నీరున్నా.. ఫలితం సున్నా

- నిరుపయోగంగా డోల్పుల వాగు ప్రాజెక్టు
- నీరున్నా ఆయకట్టుకు అందని దుస్థితి
- అధ్వానంగా కాలువలు
- విరివిగా పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


డోల్పుల వాగు ప్రాజెక్టు


పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన కాలువ

తిర్యాణి: అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది డోల్పుల వాగు ప్రాజెక్టు పరిస్థితి. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు నీరందించాలనే లక్ష్యంతో మండలంలోని సుంగాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని కోర్లోంక గ్రామంలో 2009లో రూ20.42 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు రెండు వేల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. కానీ ఈ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో నీరందించిన దాఖలాలు మాత్రం లేవు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కాలువలు సరిగా లేక ఇంకా కొన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పాటు కాలువలు ఉన్న చోట తూములు, పిల్ల కాలువలు నిర్మించక పోవడంతో ప్రాజెక్టులో నీరు ఉన్నా రైతులకు మాత్రం ఉపయోగపడటం లేదు.

నిర్వహణ లేక అందని నీరు..

ప్రాజెక్టు కుడి కాలువ పొడవు 30కిలో మీటర్లు కాగా ఎడమ కాలువ పొడవు 20 కిలో మీటర్లు ఉంటుంది. వీటిపై కేవలం 15 పిల్ల కాలువలు మాత్రమే ఉన్నాయి. కానీ వీటి నిర్వహణ సరిగా లేకపోవడం, కాలువలకు పూర్తిస్థాయిలో సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో కాలువల్లో పిచ్చి మొక్కలు, తుంగ పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఆయకట్టు చివర ఉన్న గిన్నెదరి, మాలగూడ, సాలెగూడ తదితర గ్రామాలకు సాగు నీరు అందడం లేదు. ప్రాజెక్టు సమీపంలో ఉన్న గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో సాగు నీరు అందని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కోర్లోంక గ్రామానికి పడమర దిక్కున కాలువలు లేకపోవడంతో ప్రాజెక్టు పక్కనే ఉన్న వంద ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. ఉన్న కాలువలను ఆధునీకరించి, అవసరమైనా చోట కొత్త కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఇప్పటికే ఎన్నోసార్లు ఆయకట్టు రైతులు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ కాలువల మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



డోల్పుల వాగు ప్రాజెక్టులోని కాలువల నిర్మాణంలో నాణ్యత పాటించలేదు. వాటి నిర్వహణను సైతం ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలువల్లో విరివిరిగా పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రాజెక్టు పక్కనే ఉన్న ఒక్క పంట కూడా పండించ లేకపోతున్నాం. కాలువలకు మరమ్మతులు చేపట్టాలి. వెంటనే సాగు నీరు అందేలా చూడాలి.

– కోట్నాక లచ్చు, గుడిపేట్

కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలి



కాలువలకు అనుకొని పిల్ల కాలువల నిర్మాణాలను అధికారులు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. దీంతో రైతులం స్వయంగా తాత్కాలిక కాలువలు తవ్వుకొని పంటలు సాగు చేస్తున్నాం. వెంటనే నూతన పిల్ల కాలువల నిర్మాణాలు చేపట్టాలి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– మడావి భీంరావు, కోర్లోంక

కోతకు గురైన రోడ్లు

- ప్రమాదకరంగా ప్రయాణం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


ప్రధాన మూలమలుపు వద్ద కోతకు గురైన రోడ్డు

కెరమెరి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురికాగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోతకు గురైన రోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా మార్గాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలోని పాటగూడ, చాల్‌బాడి గ్రామాల్లో సుమారు 48 కుటుంబాలు నివసిస్తుండగా, 247 వరకు జనాభా ఉంది. అయితే గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అనేకసార్లు నిరసనలు తెలిపారు. దీంతో 2004లో బీటీ రోడ్డు వేశారు. అయితే ఆ తర్వాత రోడ్డు నిర్వహణ మరిచారు. రోడ్డుకు మూడుచోట్ల అంచులు కోతకు గురి కావడంతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. మూలమలుపుల వద్ద కోతకు గురి కావడం వల్ల రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..

చాల్‌బాడి వద్ద ఓ చోట, పాటగూడ వద్ద మరో చోట.. ప్రధాన మూలమలుపుల వద్ద మరోచోట ఇలా మూడుచోట్ల రోడ్లు కోతకు గురి కావడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కోతకు గురి కావడం వల్ల అదుపుతప్పి పడిపోతే పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భయంగా ప్రయాణం



చాలాకాలంగా రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. ఒక్కసారి నిర్మించిన రోడ్డుకు మళ్లీ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చాలాచోట్ల రోడ్డు మరమ్మతులకు గురైంది. రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– ఆత్రం పావుగా, గ్రామపటేల్, పాటగూడ

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న కోవ లక్ష్మి

కెరమెరి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని గోయగాం గ్రామంలో నిర్వహించిన శ్రీ సద్గురు పూలాజీబాబా 14వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పూలాజీ మారుమూల గ్రామాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడన్నారు. సద్గుణాలను అలవర్చుకున్నప్పుడే సమాజంలో గౌరవం, మర్యాద దక్కుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు జెండా ఆవిష్కరించారు. పూలాజీబాబా చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి, సిద్దేశ్వర్ సంస్థాన్ పట్నాపూర్ అధ్యక్షుడు ఇంగ్లె కేశవ్, భక్తులు ఆత్రం భగవంత్‌రావు, పాండురంగ్, శంకర్, లక్ష్మణ్, కొండు తదితరులు ఉన్నారు.

'ఆదివాసీ ఆడబిడ్డను ఆశీర్వదించండి'


పెంచికల్‌పేట్: ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు


కెరమెరి: ప్రచారంలో పాల్గొన్న నాయకులు

పెంచికల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగుణను పార్లమెంట్‌కు పంపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని జైహింద్‌పూర్, కొండపల్లి, లోడుపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కొండపల్లి, ఎల్లూర్ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎల్లూర్ గ్రామానికి చెందిన సుంపుటం బాపు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుపతి, సాజీద్, సంజీవ్, బండు, లచ్చన్న ఉన్నారు.

జైనూర్: కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆసిఫాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకుల చేరిక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కెరమెరి: కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి సాధ్యమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బాబేఝరి, పాట్నాపూర్, పెద్దాపాట్నాపూర్, కొత్తగూడ, శివగూడ, కొలాంగూడ, టోకెన్ మోవాడ, లైన్‌పటార్, పాటాగూడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తిరుపతి, మానిక్‌రావు, రాజు, భీంరావు, ధర్మూ, ముత్తు, సోనేరావు ఉన్నారు.

బెజ్జూర్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించి అభివృద్ధికి పాటు పడాలని పార్టీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజారామ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్, నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు'


కెరమెరి: మాట్లాడుతున్న నాయకులు

జైనూర్: బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీ తిరుమల విశ్వనాథ్, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, నాయకులు ఉన్నారు.

కెరమెరి: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. సోమవారం నిసాని, ఇందాపూర్, గోండ్‌గూడ, ఆగుర్‌వాడ గ్రామ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.జగన్నాథ్, యూనూస్, భీంరావు, రూప్‌లాల్, శంకర్, నారాయణ, జాహెద్ ఉన్నారు.

బెజ్జూర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. సోమవారం మండలంలోని పాపన్‌పేట్, తలాయి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పంద్రం పుష్పలత మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. ఉప సర్పంచ్ మధుకర్, తిరుపతి, లచ్చయ్య, సుధాకర్, వైకుంఠం, ఏసయ్య, సతీశ్, సంజీవ్, సతీశ్, బానయ్య, పాల్గొన్నారు.

భగభగ మండుతున్న ఎండలు

సోమవారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో..)

ప్రాంతం	గరిష్ఠం
తిర్యాణి	46.0
జంబుగా	45.3
ధనోరా	45.1
గిన్నెధరి	45.0
ఆసిఫాబాద్	45.0
కుంచవెల్లి	44.9
రెబ్బెన	44.8
ఎల్కపల్లి	44.3
వాంకిడి	44.2
కాగజ్‌నగర్	44.1

కౌటాల: జిల్లాలో కొద్ది రోజుల నుంచి ఎండలు విపరీతంగా మండుతున్నాయి. సోమవారం జిల్లాలో తిర్యాణిలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతుండంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సోమవారం కౌటాల వారసంతకు ఎండల కారణంగా వినియోగదారులు మధ్యాహ్న సమయంలో రాకపోవడంతో కూరగాయాల దుకాణాలు వెలవెలబోయాయి. జిల్లాలోని తిర్యాణి, కాగజ్‌నగర్, కెరమెరి, ఆసిఫాబాద్ మండలాలు వార్నింగ్‌జోన్‌లో ఉండగా మిగతా 11 మండలాలు అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి. ఓపక్క ఎండ.. మరోపక్క వేడి గాలులు వీస్తుండడంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తీర్మానం


తీర్మానం చేస్తున్న సభ్యులు

బెజ్జూర్: బెజ్జూర్, పెంచికల్‌పేట పరిధిలోని కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సోమవారం సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బెజ్జూర్, బారెగూడ, ఎల్లూరు, కొండపల్లి, గుంట్లపెట్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కోసం డైరెక్టర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. డైరెక్టర్లు రాచకొండ శ్రీవర్ధన్, బోయిన భీమన్న, తేలిబాపు కమలాకర్, మేకల కోటేశ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మోడీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి


కెరమెరి: మాట్లాడుతున్న గోడం నగేశ్


వీరవెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కెరమెరి: ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశం భద్రంగా ఉంటుందని బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ హయాంలోనే అనేక నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, సీసీరోడ్లు, శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లకు కేంద్రం నిధులు విడుదల చేసిందన్నారు. అంతకుముందు శివాలయంలో పూజలు చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అరిగెల నాగేశ్వరరావు, సొల్లు లక్ష్మి, వెంకట్, వేణు, శ్రీకాంత్, తుకారం, ఉత్తం, తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మోడీ నాయకత్వంలోనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని వీరవెల్లి, పార్డీ, సాండ్‌గాం గ్రామాల్లో ఆయన ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి –గడ్చిరోలి వరకు నిర్మించే నాలుగు వరుసల జాతీయ రహదారితో సిర్పూర్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ దేశానికి రక్షణగా ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందన్నారు. ఈ నెల 13న కమలం గుర్తుకు ఓటు బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కనుమరుగు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు కనుమరుగయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు సతీశ్‌బాబు, సుహాసిని, విశాల్, లక్ష్మి, శ్రీధర్, శ్రీనివాస్, తిరుపతి, గణేశ్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్: మండలంలోని మోతిపటార్ గ్రామంలో ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గేడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మోతిపటార్, వంకామద్ది, పట్కల్‌మంగి గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాథోడ్ రాహుల్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై 'ఎక్సైజ్' దాడులు


నాటుసారా స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

రెబ్బెన: మండలంలోని తుంగెడె, తక్కళ్లపల్లి, కొత్తగూడెం గ్రామాలతో పాటు పలు అనుమానాస్పద ప్రదేశాల్లో గుడుంబా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు దాడులు చేయగా తక్కళ్లపల్లి కొత్తగూడెంలో 900 లీటర్లు, తుంగెడ శివారులో గుడుంబా తయారీ కోసం నిల్వ చేసిన 850 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. కొత్తగూడెంకు చెందిన ఆత్రం నాగయ్య నాటుసారా విక్రయిస్తూ పట్టుబడగా ఆయన వద్ద నుంచి 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ దీపక్, ఎస్సై సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి గ్రామంలో సోమవారం నాటుసారా స్థావరాలపై కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగంగా తాగేస్తున్నారు..!

- గ్రామ శివారు పంట భూములే అడ్డా
- మద్యం సీసాలను విచ్చలవిడిగా పడేస్తున్న వైనం


కౌటాల శివారులో బీరు సీసాలు

కౌటాల: మందుబాబులు మండల కేంద్రం శివారులోని పంట భూములను అడ్డాగా చేసుకున్నారు. కౌటాల పట్టు పరిశ్రమ సమీపంలోని చెరువు కింద గల వ్యవసాయ భూమిలో మందుబాబులు మద్యం సేవించి సీసాలను పడవేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో వ్యవసాయ పనులు ప్రారంభించనుండగా పగిలిన సీసాలతో గాయాలపాలవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్థలాన్ని చిన్నారులు క్రికెట్ ఆడుకోవడానికి వినియోగిస్తుండగా వందలాదిగా పడి ఉన్న బీరు సీసాలను బౌండరీ హద్దుగా ఏర్పాటు చేసుకోవడం కొసమెరుపు. బహిరంగ మద్య సేవనాన్ని నియంత్రించాల్సిన పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, అందువల్ల మందుబాబులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే బహిరంగ మద్యంపానం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'అధైర్య పడొద్దు అండగా ఉంటాం'


మాట్లాడుతున్న పాల్వాయి సుధాకర్ రావు

బెజ్జూర్: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని బెజ్జూర్ మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు అన్నారు. గత వారం రోజుల క్రితం పాపన్నపేట గ్రామానికి చెందిన అల్లె శంకర్ అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో సోమవారం దినకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, నాయకులు కొండవీటి భాస్కర్ రాజ్, నేరెళ్ల సంతోష్, జాడి దిగంబర్, వెంకటేశ్, గ్రామస్తులు ఉన్నారు.